జలవిహార్‌లో మాజీ మంత్రి, సీనియర్ నాయకులు కొప్పుల ఈశ్వర్ 'యాభై ఏండ్ల ప్రయాణం' అనే పుస్తక ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, జూలూరు గౌరీశంకర్, ఘంటా చక్రపాణి, జస్టిస్ చంద్రయ్య, కేఎస్ చలం, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, చాడ వెంకటరెడ్డి, తమ్మారెడ్డి భరద్వాజ తదితరులు

ఈశ్వర్ జీవితం ఆదర్శనీయం

- పట్టుదలకు మారు పేరు కొప్పుల
- నమ్మిన సిద్ధాంతం కోసం పాటుపడ్డ గొప్ప వ్యక్తి
- 'ఒక ప్రస్థానం' పుస్తకావిష్కరణలో మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): రాజకీయాల్లోకి రావాలనుకుంటున్న నేటి తరానికి కొప్పుల ఈశ్వర్ జీవితం ఆదర్శమని, ఆయన నిరంతరం తాను నమ్ముకున్న సిద్ధాంతం కోసం పాటుపడిన గొప్ప వ్యక్తి అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు కొనియాడారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ 67వ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన రాజకీయ జీవితంపై రచయిత నూతి మల్లన్న రాసిన 'ఒక ప్రస్థానం' పుస్తకాన్ని ఆదివారం నెక్లెస్‌రోడ్డులోని జలవిహార్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హరీశ్‌రావు మాట్లాడుతూ.. 2001నుంచి కొప్పుల ఈశ్వర్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. 'ఈశ్వర్‌తో నాకు 24 ఏండ్ల అనుబంధం ఉన్నది. ఈ పుస్తకం చదివితే వారిలో ఉన్న ఇంకో కోణం కనపడింది. ఈశ్వర్‌లో మేము ఎప్పుడూ కోపం, అసహనం చూడలేదు. చాలా కూల్‌గా, ప్రేమగా, ఆప్యాయంగా ఉంటారు. ఈ పుస్తకం చదివిన తరువాత ఆయనలో గొప్ప పోరాటయోధుడు కనిపించారు. ఈయనేనా అప్పట్లో కార్మికుల కోసం జావీదులు, జాఫర్ల మీద పోరాటం చేసింది అని అనిపించింది. మేమంతా కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమంలో పనిచేశాం. కానీ, కార్మికోద్యమం, విప్లవోద్యమం, తెలంగాణ ఉద్యమం వంటి మూడు ఉద్యమాల్లో పనిచేసిన ఘనత కొప్పుల ఈశ్వర్‌ది. ఈ మూడు ఉద్యమాల్లోనూ జైలుకి వెళ్లిన వ్యక్తి ఆయన..కూలి పని నుంచి క్యాబినెట్ మంత్రి వరకు ఈశ్వర్ ప్రస్థానాన్ని అద్భుతంగా వివరించిన పుస్తక రచయిత మల్లన్నకి హృదయపూర్వక శుభాకాంక్షలు' అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈశ్వర్ సతీమణి స్నేహలతగానే తనకు తెలుసునని, కానీ ఈ పుస్తకం ద్వారా ఆమె అసలు పేరు కోకిల అని తెలిసిందని చెప్పారు. ఆమె వల్లనే ఈశ్వర్ జీవితం మారిందని పేర్కొన్నారు. కమ్యూనిస్టు ఉద్యమాల్లో పాల్గొన్నా కూడా నవరాత్రుల్లో దేవీ దీక్ష తీసుకునేంత భక్తి ఈశ్వర్‌లో ఉన్నదని వివరించారు. బీఆర్ఎస్ తరపున కేసీఆర్ నాయకత్వంలో వరుసగా ఆరు సార్లు ఓటమి ఎరుగని నాయకుడిగా అద్భుత విజయాలు సాధించారని గుర్తచేశారు. 'మాది అన్నదమ్ముల అనుబంధం. ప్రజల కోసం పట్టుబట్టి వెంటపడి పని చేయించుకునేవారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన అంబేద్కర్ విగ్రహాన్ని కేసీఆర్ నాయకత్వంలో కొప్పుల ఈశ్వర్ ప్రతిష్ఠించారు. ఈతరం నాయకులు ఆయన నుంచి ఈ గుణాన్ని నేర్చుకోవాలి' అని హరీశ్‌రావు పేర్కొన్నారు. అనంతరం కొప్పుల ఈశ్వర్‌తో గతంలో పనిచేసి అమరులైనవారి కుటుంబసభ్యులను హరీశ్‌రావు సన్మానించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నంది శ్రీనివాస్ పుస్తక సమీక్ష చేయగా, శాసనమండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్, మాజీ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, మాజీ మంత్రులు జీ జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, ఎల్ రమణ, యూపీఎస్సీ మాజీ సభ్యుడు కేఎస్ చలం, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ప్రముఖ సినీ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, రామ సత్యనారాయణ, ఈశ్వర్ కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

30 కేసులున్నా నాతో నడిచింది

నేను చూసిన సింగరేణిని నేటి తరానికి అందించే ప్రయత్నమే ఈ పుస్తకం. నాడు విప్లవ పార్టీలో పనిచేసిన సందర్భంలో నాపై 30 కేసులు ఉన్నాయని తెలిసి కూడా నా తోడుగా, నా భార్యగా స్నేహలత నడిచింది. 17 మంది బొగ్గు బావుల్లో జలసమాధి అయినప్పుడు కేసీఆర్ స్పందించి వారి కుటుంబాలకు రూ.6 లక్షల పరిహారం అందేలాచేశారు. నా రాజకీయ ప్రస్థానంలో కేసీఆర్ నాకొక గొప్ప అవకాశం కల్పించారు. దాన్ని నిలబెట్టుకున్నాను. సింగరేణి కార్మిక సంఘం (సికాస) నిర్మాణం, గోదావరిఖని విషయాలెన్నో ఈ పుస్తకంలో దాగి ఉన్నాయి

–కొప్పుల ఈశ్వర్, మాజీ మంత్రి

విప్లవభావాల కలయికనే బీఆర్ఎస్

మహనీయుడు అంబేద్కర్, విప్లవభావాలు కలిగిన జార్జిరెడ్డి లాంటి వారి ఆశయాల కోసం పనిచేసిన వాళ్లం. విప్లవభావాలు కలిగిన వారమంతా స్వరాష్ట్ర సాధనలో ముందునిలిచాం. ఆ సిద్ధాంతం మీద ప్రేమతోనే ప్రజలకు సేవలందిస్తున్నం. ఈశ్వర్ తన జీవితాన్ని మాత్రమే కాకుండా సమాజాన్ని ఇందులో ప్రతిబింబించారు.

–సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ మంత్రి

తెలంగాణ పరిస్థితులను తెలుపుతున్నది

కొప్పుల ఈశ్వర్ తన ప్రస్థానంలో తెలంగాణ పరిస్థితులను ప్రతిబింబించారు. సామాజిక, విప్లవ పరిస్థితులను ఇందులో ప్రస్తావించడం బాగున్నది. ఉద్యమ సహచరుడు, ఇద్దరం కలిసి ప్రజాసేవలో ఉన్నవాళ్లమే.

–జీ జగదీశ్‌రెడ్డి, మాజీ మంత్రి

ఎర్రజెండా బాటలోనే..

కొప్పుల ఈశ్వర్ ప్రస్థానం ప్రారంభమైంది ఎర్రజెండాతోనే. కార్మికుడి నుంచి క్యాబినెట్ మంత్రి వరకు ఎదిగారు. అంచలంచలుగా ఎంత ఎదిగినా ఒదిగి ఉండటం ఈశ్వర్‌లోని లక్షణం.

–చాడ వెంకటరెడ్డి, సీపీఐ నేత

బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

గులాబీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ) : జనగామ జిల్లా తరిగొప్పుల మండలం బొత్తలపర్రెకు చెందిన 50 మంది కాంగ్రెస్ ముఖ్య నాయకులు ఆదివారం జనగామలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 16నెలలు గడుస్తున్నా పాలన విషయంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేదల కోసం ఉచిత వైద్యం అందిస్తున్న తీరును మెచ్చి బీఆర్ఎస్‌లో చేరినట్టు పేర్కొన్నారు.

జనగామలో కాంగ్రెస్ నాయకులకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మాట్లాడుతున్న ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ. చిత్రంలో నాయకులు మారుతీసాగర్, రమేశ్ హజారి, రమణకుమార్ తదితరులు

మే 31న టీజేఎఫ్ రజతోత్సవాలు

- హైదరాబాద్ వేదికగా నిర్వహణ
- మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ

దామెర, ఏప్రిల్ 20 : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మొదలైన మలిదశ ఉద్యమ పోరాటంలో మొట్టమొదటి రాజకీయేతర వేదిక తెలంగాణ జర్నలిస్టు ఫోరం అని మీడియా అకాడమీ మాజీ చైర్మన్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ అన్నారు. టీజేఎఫ్ ఆవిర్భవించి మే 31 నాటికి 24 ఏండ్లు పూర్తి చేసుకుని 25వ ఏట అడుగుపెడుతున్న సందర్భంగా రజతోత్సవ సభ నిర్వహణ కోసం టీయూడబ్ల్యూజే- హెచ్143 ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ జిల్లా దామెర మండలం దుర్గంపేట శివారులోని ఎన్ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనకోసం మలిదశ ఉద్యమ పోరాటంలో 2001లో నాటి టీఆర్ఎస్ పార్టీ పురుడు పోసుకున్న నెలరోజులకే పుట్టిన మొట్టమొదటి రాజకీయ వేదిక తెలంగాణ జర్నలిస్టు వేదిక అని పేర్కొన్నారు. రాష్ట్రసాధన వరకు పలు కీలక దశల్లో టీజేఎఫ్ పోషించిన చారిత్రక పాత్ర మహోన్నతమైనదని కొనియాడారు. తెలంగాణ అస్తిత్వ పోరాటంలో వరంగల్ జిల్లా టీజేఎఫ్ పోషించిన పాత్ర కూడా చాలా గొప్పదని అన్నారు. ఇక్కడ నుంచి జర్నలిస్టు సునీల్ ఆత్మబలిదానం చేసిన చరిత్ర ఉన్నదని తెలిపారు. హైదరాబాద్ వేదికగా రజతోత్సవాలను నిర్వహించడంతోపాటు, అన్నిజిల్లాల జర్నలిస్టులు తరలిరావాలని తీర్మానించింది. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీసాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేశ్ హజారి, కోశాధికారి యోగానంద్, తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు యూనియన్ (టెమ్జ్) రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణకుమార్ పాల్గొన్నారు.

500 మంది రైతులను బలిగొన్న కాంగ్రెస్

- ప్రభుత్వ తీరును నిలదీస్తున్న ప్రజలపై కాంగ్రెస్ పాట్టేళ్ల దాడి
- బీఆర్ఎస్ శ్రేణులపైకి పోలీసులను ఉసిగొల్పుతున్న రేవంత్ సర్కార్
- రేవంత్ సర్కార్ దుష్టపాలనకు సమయం దగ్గరపడింది..
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 20: కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి, దగాకోరు పాలన ఫలితంగా రాష్ట్రంలో రైతుల మరణ మృదంగం మార్మోగుతున్నదని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. సంక్షేమ పథకాలను బొందపెట్టిన కాంగ్రెస్ పాలనపై రోజురోజుకూ ప్రజావ్యతిరేకత పెరుగుతున్నదని ఆరోపించారు. ప్రజలే ఎక్కడికక్కడ మంత్రులు, ఎమ్మెల్యేలపై తిరుగుబాటు చేస్తున్నారని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌ను పాతిపెట్టిన రేవంత్ సర్కార్.. రైతుబంధును అమలు చేయకపోవడం, కాళేశ్వరాన్ని పండబెట్టి పంటలు ఎండబెట్టడం, రుణమాఫీ చేయకపోవడంతో వ్యవసాయం కుప్పకూలి రైతన్న సతమతమవుతున్నాడని ఆందోళన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ నిర్లక్ష్య పాలనతో ఇప్పటికే దాదాపు 500 మంది రైతులు ప్రాణాలు పోగొట్టుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ భూదాహానికి మూగజీవులు సైతం బలవుతున్నాయని ఆవేదన చెందారు. సర్కారు మోసాలను నిలదీస్తున్న ప్రజలపై కాంగ్రెస్ పొట్టేళ్లు దాడి చేస్తున్నాయని విమర్శించారు. ఇటీవల భీమ్‌గల్ వచ్చిన మంత్రి జూపల్లి కృష్ణారావును కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఏమైందని అడిగినందుకు కాంగ్రెస్ నాయకులు దౌర్జన్యానికి దిగడం దారుణమని అన్నారు. బీఆర్ఎస్ జెండా పట్టినా, ఫ్లెక్సీ కట్టినా జైలుపాలు చేయడం, ధర్నా చేసినా, ఇంట్లోనే ఉన్నా నిర్బంధాలు అమలు చేయడం రేవంత్ ప్రభుత్వంలో నిత్యకృత్యంగా మారినట్టు తెలిపారు. ప్రభుత్వం బీఆర్ఎస్ శ్రేణులపైకి పోలీసులను ఉసిగొల్పుతున్నదని మండిపడ్డారు. కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసినా కేసు పెడుతున్నారని, అప్రకటిత ఎమర్జెన్సీ పడగనీడలో రాష్ట్రం బిక్కుబిక్కుమంటున్నదని తెలిపారు. కాంగ్రెస్ సర్కారుకు పోయే కాలం దాపురించిందని, రేవంత్‌రెడ్డి సాగిస్తున్న దుష్టపాలనకు ప్రజలు చరమగీతం పాడే రోజు ఎంతో దూరంలో లేదని హెచ్చరించారు.

జేలోడుకుంట కట్టమైసమ్మ గుడి సమీపంలో బోల్తా పడిన ఆర్టీసీ బస్సు

స్టీరింగ్ రాడ్ విరిగి ఆర్టీసీ బస్సు బోల్తా

- 30 మందికిపైగా గాయాలు
- సూర్యాపేట జిల్లా , చింతలపాలెం శివారు జేలోడుకుంట వద్ద ఘటన

చింతలపాలెం, ఏప్రిల్ 20 : ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పి బోల్తా పడిన ఘటన సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం జేలోడుకుంట వద్ద ఆదివారం చోటుచేసుకున్నది. ప్రయాణికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కోదాడ నుంచి నక్కగూడెం వెళ్తున్నది. ఈ క్రమంలో చింతలపాలెం శివారులోని జేలోడుకుంట, కట్టమైసమ్మ గుడి వద్దకు రాగానే అకస్మాత్తుగా బస్సు స్టీరింగ్ రాడ్ విరగడంతో బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. వెంటనే స్థానిక యువకులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. బస్సు బోల్తా పడిన సమయంలో 65 మంది ప్రయాణికులు ఉండగా, దాదాపు పది మందికి తీవ్ర గాయాలు, 30 మందికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను అంబులెన్స్‌లు, ప్రైవేట్ వాహనాల ద్వారా మేళ్లచెర్వు, హుజూర్‌నగర్, కోదాడ, ఖమ్మం దవాఖానలకు తరలించారు. ఈ బస్సు బైక్‌ను కూడా ఢీకొట్టడంతో వారికి కూడా తీవ్ర గాయాలయ్యాయి.

త్వరలో ఆర్టీసీలో 3,038 ఉద్యోగాల భర్తీ

ఆర్థికశాఖ నుంచి అనుమతి వచ్చింది : మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీలో త్వరలోనే ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్టు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 3,038 ఉద్యోగాల భర్తీకి ఆర్థికశాఖ అనుమతి ఇచ్చిందని, త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేస్తామని చెప్పారు. ఆర్టీసీలో సుదీర్ఘకాలం తర్వాత ఉద్యోగాలు భర్తీ చేస్తున్నట్టు వివరించారు. ఏయే ఉద్యోగాలు ఎన్ని భర్తీ చేయనున్నారో తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగాల భర్తీకి ప్రతిపాదనలు

ఉద్యోగం	సంఖ్య
డ్రైవర్	2,000
శ్రామిక్	743
డిప్యూటీ సూపరింటెండెంట్ (ట్రాఫిక్)	84
డిప్యూటీ సూపరింటెండెంట్ (మెకానికల్)	114
డిపో మేనేజర్/అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్	25
అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్	18
అసిస్టెంట్ ఇంజినీర్ (సివిల్)	23
సెక్షన్ ఆఫీసర్ (సివిల్)	11
అకౌంట్ ఆఫీసర్	6
మెడికల్ ఆఫీసర్ (జనరల్)	7
మెడికల్ ఆఫీసర్ (స్పెషలిస్ట్)	7
మొత్తం	3,038



ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు

కౌంటర్ ఇస్తే పోలీసు కేసులా?

- అధికార పార్టీ ఎమ్మెల్యే అనుచితంగా మాట్లాడితే తప్పు కనిపించడం లేదా?
- బీఆర్ఎస్ కార్యకర్తలను కొడితే ఊరుకునేదే లేదు
- మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి హెచ్చరిక

మెదక్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుపై వెంటనే కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆదివారం ఆమె ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె బీఆర్ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. 14 ఏండ్లు పోరాడి తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేర్చిన కేసీఆర్ పట్ల ఈనెల 17న అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మెదక్ నియోజకవర్గ ప్రజలకు ఎన్నో హామీలిచ్చి నెరవేర్చకపోగా బీఆర్ఎస్ కార్యకర్తలపై కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజలతో ఓట్లు వేయించుకొని అభివృద్ధి చేయకుండా నోటికొచ్చినట్టు మాట్లాడి ఎదుటివారి మనోభావాలను దెబ్బతీస్తున్నారని, ఇలాంటి కుట్రలు చెల్లవని అన్నారు. దమ్ముంటే ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు చేస్తూ కేసులు నమోదు చేయిస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు.

కొత్త డీజీపీ ఎవరు?

- నేడు కేంద్రానికి ప్రతిపాదనలు
- జాబితాలో సీవీ ఆనంద్, సౌమ్యామిశ్రా, రవిగుప్తా, శివధర్‌రెడ్డి, శిఖా పేర్లు?

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర నూతన డీజీపీ నియామకానికి సంబంధించి ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. కొత్త డీజీపీ పోస్టు కోసం ఐదుగురి పేర్లతో ప్రతిపాదనను సోమవారం కేంద్రానికి పంపనున్నది. ఈ మేరకు ప్రభుత్వం సీనియార్టీ జాబితాను రూపొందించినట్టు తెలిసింది. కేంద్రప్రభుత్వం ఈ నెల తొలి వారంలోనే నూతన డీజీపీ నియామకంపై రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. ఐదుగురి పేర్లతో ప్రతిపాదనలు పంపించాలని, ఆ జాబితాలో నుంచి ముగ్గురి పేర్లను సూచిస్తామని పేర్కొన్న విషయం విదితమే. దీంతో కేంద్రంలోని డీవోపీటీ ఆదేశాల మేరకు ఐదుగురి పేర్లతో ప్రతిపాదిత జాబితాను సిద్ధం చేసినట్టు సమాచారం. కాగా, నిబంధనల మేరకు డీజీపీ ర్యాంకు ఉండి, రెండేండ్ల పదవీకాలం ఉన్నవారికి డీజీపీ పోస్టు కోసం ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో సీనియార్టీలో తొలి వరుసలో ఉన్న సీవీ ఆనంద్, రవి గుప్తా, సౌమ్యామిశ్రా, శివధర్‌రెడ్డి, శిఖా గోయల్ పేర్లతో రాష్ట్ర ప్రభుత్వం జాబితా రూపొందించినట్టు తెలిసింది. కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, జితేందర్ కూడా సీనియర్లుగా ఉన్నప్పటికీ వీరు మరో ఆరు నెలల్లో ఉద్యోగ విరమణ చేయనున్నారు. దీంతో వారి పేర్లను పరిగణనలోకి తీసుకోలేదని తెలిసింది. అయితే, రవిగుప్తా కూడా ఈ ఏడాది ఆఖరులో ఉద్యోగ విరమణ చేయనున్నారు. అయినప్పటికీ ఆయన పేరును జాబితాలో చేర్చినట్టు తెలుస్తున్నది. ఈసారి ఆనంద్, శివధర్‌రెడ్డి, సౌమ్యామిశ్రాల్లో ఒకరికి డీజీపీ పదవి దక్కడం ఖాయమని పోలీసు వర్గాలు చెప్తున్నాయి. అన్ని సమీకరణాలు కుదిరితే రాష్ట్రంలో తొలి మహిళా డీజీపీగా సౌమ్యామిశ్రాకు అవకాశం లభించినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని అంటున్నాయి. అయితే, రాజకీయ, సంస్థాగత సమీకరణాల ప్రకారం చూస్తే సీవీ ఆనంద్, శివధర్‌రెడ్డిల్లో ఒకరికి డీజీపీ పదవి లభించే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. సోమవారం జాబితాను ఫైనల్ చేసి కేంద్రానికి పంపిస్తే నెలాఖరు లేదా వచ్చే నెల తొలివారంలోనే కొత్త డీజీపీ కొలువుదీరే అవకాశం ఉన్నది.

నెలాఖరులో సీఎస్, పీసీసీఎఫ్‌లు కూడా...

ఈ నెలాఖరుతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పదవీ విరమణ చేయనున్నారు. అదే సమయంలో అటవీ శాఖ పీసీసీఎఫ్ డోబ్రియల్ కూడా పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో మే ఒకటో తేదీ నాటికి సీఎస్, పీసీసీఎఫ్‌లుగా కొత్తవారు నియామకయ్యే అవకాశం ఉంది. ఒకవేళ నూతన డీజీపీ నియామకం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక నిర్ణయం తీసుకుంటే మే నెలలో రాష్ట్రంలోని మూడు కీలకమైన పోస్టుల్లో ముగ్గురు అధికారులు కొత్తవారే కొలువుదీరనున్నారు.

పాకిస్థాన్‌లో హిందూ మంత్రిపై దాడి

ఇస్లామాబాద్, ఏప్రిల్ 20: పాకిస్థాన్‌లో ఓ హిందూ మంత్రిపై కొంతమంది టమోటోలు, ఆలుగడ్డలతో దాడికి పాల్పడ్డారు. సింధ్ ప్రావిన్స్‌లో ప్రభుత్వం చేపట్టిన సాగునీటి కాలువ నిర్మాణ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా నిరసనలు చేపడుతున్న ఆందోళనకారులు, హిందూ నేత ఖియాల్ దాస్ కోహిస్తానీ కాన్వాయ్‌పై దాడికి పాల్పడినట్టు తెలిసింది. దాడి ఘటనను ప్రధాని షెహబాజ్, సింధ్ ప్రావిన్స్ సీఎం సహా పలువురు నేతలు ఖండించారు. ఘటనకు బాధ్యులైనవారిని కఠినంగా శిక్షిస్తామని ప్రధాని ప్రకటించారు. కోహిస్తానీ పాకిస్థాన్ అధికార పార్టీ పీఎంఎల్-ఎన్ సభ్యుడు, ప్రస్తుత షెహబాజ్ సర్కార్‌లో మత వ్యవహారాల మంత్రిగా ఉన్నారు.

ఆర్టీసీ అపాయింటెడ్ డే ఎప్పుడు?

- ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనాన్ని అడ్డుకుంటున్న ఓ కీలక నేత..!
- కార్మికులను నమ్మించి గొంతు కోసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- ఆర్టీసీ కార్మికుల సమస్యలు పట్టించుకునే స్థితిలో లేని సీఎం
- సమ్మె డిమాండ్లలో అపాయింటెడ్ డేనే ప్రధానమంటున్న నేతలు
- సర్కారు మొండి వైఖరిపై కార్మిక సంఘాల తీవ్ర ఆగ్రహం

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): టీజీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు ముహూర్తం కుదరడం లేదు. స్వరాష్ట్ర ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులను.. ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చాలనే లక్ష్యంతో 2023 ఆగస్టులో కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించి సంబంధిత బిల్లును గవర్నర్‌కు పంపింది. దానిపై నాటి గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ మొదట్లో కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ బీఆర్ఎస్ పోరాటం, కార్మికుల ఆందోళనలతో ఆ బిల్లుపై సంతకం చేశారు. దీంతో 2023 సెప్టెంబర్ 15న గెజిట్ నోటిఫికేషన్ కూడా వచ్చింది. కానీ, ఆ తర్వాత 2023 అక్టోబర్‌లో ఎన్నికల కోడ్ రావడంతో అపాయింటెడ్ డే పెండింగ్‌లో పడిపోయింది. దీంతో దాదాపు 40 వేల మంది ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల ఆశలు అడియాశలుగానే మిగిలిపోయాయి. కాగా, రాష్ట్రంలో తాము అధికారంలోకి రాగానే ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా మారుస్తామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు రాష్ట్రమంతటా ఊదరగొట్టారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతోపాటు కార్మికులకు వెంటనే రెండు పీ ఆర్సీ బకాయిలు చెల్లిస్తామని, తదుపరి పీఆర్సీ పరిధిలోకి టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగులను తీసుకొస్తామని ఆ పార్టీ మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చారు. ఆ హామీలను నమ్మి కాంగ్రెస్‌కు ఓట్లేసిన ఆర్టీసీ కార్మికులు తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తారేమోనని 16 నెలలుగా ఎదురు చూస్తున్నారు. కానీ, ఆ హామీలు నెరవేరకపోవడం, ఇప్పటికీ అపాయింటెడ్ డేను ప్రకటించకపోవడంపై మండిపడుతున్నారు. అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ నేతలు విలీన హామీని పక్కనపెట్టారని ధ్వజమెత్తుతున్నారు. విలీన ప్రక్రియకు సంబంధించిన విధివిధానాల ఖరారుకు ఏర్పాటైన కమిటీ ఇప్పటికీ పని ప్రారంభించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ కీలక నేత తెరవెనుక నుంచి విలీన ప్రక్రియను అడ్డుకుంటున్నాడని, ఇప్పటికైనా వెంటనే అపాయింటెడ్ డేను ప్రకటించకపోతే ఆ రహస్యాలన్నీ బట్టబయలు చేస్తామని కార్మిక సంఘాలు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాయి.

విలీన కమిటీలో కార్మిక సంఘాలుండాలి

ఆర్టీసీ విలీన ప్రక్రియకు సంబంధించిన కసరత్తు అంతా బీఆ